# మిస్చిఫ్

చాలా మందికి శరీరం మాత్రం భాగానే ఉంటుంది, గుండె మాత్రం అతి నీరసంగా ఉంటుంది. చాలా ఊళ్ళకి కూడా ఇదే జబ్బు, ఊరు ఎంత విశాలంగా అయినా పెరిగి పోతూ ఉంటుంది. ప్రజారోగ్యానికి మూలకేంద్రం కావలసిన ఆస్పత్రి మాత్రం ఇరుకుగా ఘోరంగా నిర్వహించబడుతూ ఉంటుంది. కర్మం చాలక ఒక్కసారి ఫిలిమ్ అడ్డదిడ్డంగా తెరపై పడితే చాలు, సినిమా హాలులో గోల తారాపథానికి లేచిపోతుంది. ఫిలిమ్ సప్లై లేదని ఆరేసి నెలలపాటు ఆస్పత్రి ఎక్స్‌రేవార్డు మూలపడినా ఒక్కరికీ చీమ కుట్టినట్టయినా ఉండదు। ఈ వెర్రి ప్రజకి ఇలా అశుభ్రంగా అజ్ఞానంగా ఉండిపోటమే ఇష్టమేమో! ఏదైనా మార్పు వస్తే దుఃఖపడి పోతారేమో!

సోమశేఖరంని కలుసుకోకముందు మన ఆస్పత్రుల నిర్వహణ విషయమై శేషాద్రి అభిప్రాయాలు పై విధంగా

సాగుతూ ఉండేవి. పనిమీద ఆ ఊరిమీంచి వెడుతూ అతని ఊళ్ళో దిగి, అక్కడ ఓ రోజు గడిపిన శేషాద్రి అవే కాదు, ఇంకా ఎన్నో అభిప్రాయాలు మార్చుకోవలసి వచ్చింది.

"ఇంకా ఇలా వయసు వచ్చిందో లేదో అలా ఎన్నో చిలక్కొట్లకి ఎగబడిన రకం. ఈ పాటికి ఎండిన మాగాయ టెంకలా తయారయి ఉంటాడు వెధవ" అనుకున్న శేషాద్రి "గరమ్ గరమ్ గులాబ్ జామ్" లాంటి ఫ్రెండుని చూడగానే విస్తుపోయాడు.

"ఇలాంటి ఆకతాయి పీనుగలకి సంసార సుఖం కూడా ఏం ఏడుస్తుంది గనక!" అనుకున్న శేషాద్రికి ఎనిమిదేళ్ళయి పెళ్ళయిన శైలజా సోమశేఖరం మొన్న మొన్ననే మూడు నిద్రలూ పూర్తయినట్టు 'మూడు ముద్దులూ, ఆరు కౌగలింత లూ'గా తనముందే తిరుగు తూంటే మతే పోయింది!

"ఎంత మార్పు వచ్చిందిరా నీలో!" అన్నాడు ఆశ్చర్యంగా.

నవ్వేశాడు సోమశేఖరం, 'నేను నేనే సుమా!' అన్నట్టు. మధ్యాహ్నం గాని ఆస్పత్రికి రాలేనని కో డాక్టరుకి ముందే కబురు చేశాడు అతడు. మధ్యాహ్నం మూడింటికి కాఫీ ఫలహారాలు అయ్యేక స్నేహితులిద్దరూ కబుర్లు చెప్పుకుంటూ ఆస్పత్రికి చేరుకున్నారు. శేషాద్రికి ఒక్కొక్క వింగూ చూపిస్తూ వాటి వాటి ప్రాముఖ్యతల్ని వివరిస్తూ తన రూంకి తీసుకొచ్చేడు సోమశేఖరం.

ఏ వైద్యశాలలో అయినా కత్తులు మెరుస్తాయి, కత్తెరలు మెరుస్తాయి. పరిశుభ్రంగా ఉంచితే గోడలతో పాటు

నేలకూడా మెరుస్తుంది. అనేక విధాల రాబడికి ఆస్పత్రి కూడలి కనుక డాక్టర్ల కళ్ళు కూడా సాధారణంగా మెరుస్తూనే ఉంటాయి. పేషంట్ల కళ్లు మెరవడం మాత్రం బహు అరుదు. అదికూడా ఇక్కడ గుర్తించిన శేషాద్రి మనసు మిత్రుడి పట్ల ప్రశంసతో జోహారు చేసింది.

"ఏంరా ఎలా ఉంది మన తడాఖా?" అన్నాడు సోమశేఖరం వెలిగించిన సిగరెట్టుని శేషాద్రికి ఆఫర్ చేస్తూ... ... అందుకుంటూ ఇతను జవాబిచ్చేడు.

"నీకేం నాయనా, ఎక్కడున్నా చుక్కల్లో చంద్రుడివి! ఇది ఇటు పల్లెటూరూ కాదు, అటు పట్నమూ కాదని విన్నాను. ఇలాంటి లిటిగెంట్ కార్నర్‌లో ఇంత సక్సెస్‌ఫుల్‌గా మేనేజ్ చేస్తున్నా వంటే నిన్నభినందించ వలసిందే. ఆరేడేళ్ళయింది నిన్ను చూసి. అప్పటి నీ బద్ధకం, పెంకి తనం, తుంటరి తనం తలుచుకుంటే నువ్వేనా ఈ నాడు ఇలా తయారయింది అనిపిస్తుంది. ఇంతటి ఊరికి ఇది చిన్నదైతే అవుగాక, నువ్విక్కడికి వచ్చి ఆర్నెల్లే అవనీగాక, ఈ పల్లెటూరి పాలిటిక్సు నిన్నేం చిత్తు చెయ్యలేక పోయాయి. పైగా పద్ధతిలో క్రమశిక్షణలో నువ్వేపిళ్ళకి సిగ్గు వచ్చేటట్టు చేశావనుకుంటాను. కంగ్రాచ్యులేషన్స్" సోమశేఖరం ఎందుకో గాని పక పక నవ్వేశాడు.

"ఎందుకురా నవ్వుతున్నావ్, నేనన్న దాంట్లో ఏమైనా తప్పుందా?"

"చెప్పు, చెప్పు"

"ఇంక చెప్పడానికేముంది? నిన్ను చూస్తే కడుపు

నిండిపోతోంది నాకు. ఆ రోజుల్లో నీ వెకిలి వేషాల్ని చూసి మీా అమ్మ ఎంత బెంగపెట్టుకుందో నా కిప్పటికీ గుర్తుంది. ఇప్పుడు నిన్ను చూస్తే ఆ తల్లి ఎంత సంతోషించునో। ఇంతకీ నీలో ఇంతటి మార్పుకి కారణం మీా శ్రీమతే అని నా అంచనా. కరెక్టేనా?

సోమశేఖరం ఏం జవాబు చెప్పనోగాని గోడగడియారం నాలుగ్గంటలు కొట్టగానే లేచి నిలుచున్నాడు.

"ఒరే, ఒసారి నేను రౌండ్సు తిరిగి వచ్చేస్తాను. ఓ అర గంట అఫీషియల్ వర్క్ ఉంటుంది, ఎమర్జెన్సీ ఏవైనా కేసులు ఉంటే అప్పజెప్పి వచ్చేస్తాను. చూడు ఆ లోపలిగది నాకు ప్రత్యేకం మంచం అదీ ఉంటుంది. పక్క షెల్ఫ్‌లో పత్రికలూ పుస్తకాలూ ఉంటాయి. నీకు నచ్చింది చేతికి తీసుకుని ఓ మారు పక్కమీాదకి వాలు. ఫ్లాస్కులో కాఫీఉంది, డ్రాయర్లో కొత్త సిగరెట్టుపెట్టె ఉంది. ఇంకేం కావల్సినా గుమ్మంలో ప్యూన్ ఉంటాడు పిలు. నేనిప్పుడే వచ్చేస్తాగా." శేషాద్రి జవాబు చెప్పకుండానే గబగబ వెళ్ళిపోయాడు.

ఫ్లాస్కూ సిగరెట్టుపెట్టె ఇంచుమించు ఖాళీ చేసినా శేషాద్రికి టైం గడవలేదు. తనకేదో జీవితం అతి భారంగా గడచి, పోల్చుకుని, నిట్టూరుస్తున్నాడను కోడానికి లేదు, నెల జీతం తెచ్చే కూతుర్నేగాక, సంవత్సరానికి నాలుగుబళ్ళ ధాన్యంవచ్చే పొలం కూడా ఇచ్చాడు అతని మామగారు మెయినే రోడ్‌లో ఉన్న అతి పెద్ద ఫ్యాన్సీషాపు మేనేజిమెంటు శేషాద్రిదే ... తనతో పోలిస్తే సోమశేఖరం ఆర్థికపరిస్థితే కాస్త వెనకబడి ఉంటుంది. అందుకని కాదు... రాజకీయ కక్షలకి

ఆటపట్టయిన యీ ఊళ్ళో కడుపులో చల్ల కదలకుండ ఇలా చిరునవ్వుతో నిర్వహించకు రాడానికి సోమశేఖరం చేసిన కృషి ఏమిటా అని... దార్లో తను వేసిన ప్రశ్నలు గుర్తుకు తెచ్చుకున్నాడు శేషాద్రి.

"వైద్య శాస్త్రంలో ఊహించలేనంత వేగంగా, వింతగా, పరిశోధనలు జరుగుతున్నాయి. చికిత్సావిధానంలో శస్త్ర ప్రక్రియల్లో ఎన్నెన్నో కొత్త పద్ధతులు అనులులోకి వస్తున్నాయి. మామూలు మనిషి చదవడానికి కూడా ఎంతో ఇంట్రస్టింగ్‌గా ఉండేలా మెడికల్ జర్నల్స్ తీర్చి దిద్దబడుతున్నాయి. ఇవన్నీ ఎప్పటికప్పుడు చదివి, మందులు తెప్పించి, మీ ఆస్పత్రిలో అమల్లో పెడతావు కాబోలు... అందుకే నువ్వంటే అందరికీ అంత గురి... అవునా?"

సోమశేఖరం జవాబుగా నవ్వి ఊరుకున్నాడు.

"ఈ ఊరికే కాక ఈ చుట్టుపక్కల పల్లెటూళ్ళకి కూడా ఇదే పెద్ద గవర్నమెంటు ఆస్పత్రి. మీకు పోటీగా ప్రైవేటు ప్రాక్టీషనర్స్ కూడా అట్టే మంది ఉన్నట్టులేరు. ఏ మాత్రం కష్టపడి నిజాయితీగా పని చేసినా ఇలాంటి చోట గుర్తింపూ రాణింపూ ఉంటాయి. అవి నిలబెట్టుకోడం కోసం మరింత రాత్రీ పగలూ అనకుండా కష్టపడుతున్నట్టున్నావు... అవునా

మళ్ళీ అతని చిరునవ్వే జవాబు.

"ఏంరా, చెప్పకుండా ఎందుకా ముసిముసి నవ్వులూ? మకుటంలేని మహారాజుగా నేనే గదా వెలిగిపోతున్నానని ఆనందం పట్టలేక పోతున్నావా యేం? అదేదో నాకూ కాస్త

కాస్త చెప్పకూడదూ? ఇలా బెల్లంకొట్టిన రాయిలా గడప దల్చుకుంటే నా మానాన్న నన్ను పోనియ్యక ఇక్కడెందుకు ఉంపినట్టూ?"

కావ్యనాయిక లాంటి శేషాద్రి కోపం చూసి సోమశేఖరం మరింత విరగబడి నవ్వేడు. ఇంతలో ఆస్పత్రికి రానే వచ్చేశారు. నడిచిన సంభాషణ నెమరు వేసుకుంటూ శేషాద్రి మరో సిగరెట్ వెలిగించే లోగా తలుపెవరో కొట్టేరు. తీశాడు. పది పదిహేను మంది. పెంచిన జెంపలూ. వంచిన గిరజాలూ 'మేం కాలేజీ కుర్రాళ్ళం' అని చాటి చెబుతున్నాయి. ఎందుకో అందరూ చాలా ఉద్రేకంగా ఉన్నారు.

"డాక్టరు గారు లేరా?" అని అడిగేరు తలుపు తీసిన శేషాద్రిని చూసి.

"సర్జికల్ వార్డు దగ్గర ఉన్నారు" అని వార్డుబాయ్ చెప్పిన సమాచారం విని ఆ మూక అటు కదిలింది. వాళ్ళలో ఒక కుర్రాణ్ణి పిలిచి శేషాద్రి జరిగిన సంగతి కనుక్కున్నాడు.

ఆ ఊరి కాలేజీలో ఆ ఏడాది యూనియన్ ఎలక్షన్లలో ప్రెసిడెంటు పదవికి నాయుడమ్మ పార్టీ మార్కండేయులు పోటీచేసి ఓడిపోయాడట. అప్పట్నించీ ఆ పార్టీవాళ్ళకి గెలిచిన కోటిలింగం పార్టీ కేండిడేటు శివకోటి మీద ఎంతైనా కోపంగా ఉందట. ఆ రోజు సినిమా హాల్లో మ్యాటినీ జరుగుతుండగా హాజరయిన రెండు పార్టీల ముఖ్యులూ కొట్టుకున్నారుట. శివకోటికి బాగా దెబ్బలు తగిలేయట.

"పోలీసు రిపోర్టు ఇచ్చాం... శివకోటిని ఎవరు కొట్టేరో మాకు స్పష్టంగా తెలుసు కావలసినంత సాక్ష్యం

ఉంది. ఈ దెబ్బతో నాయుడమ్మ నాశనమవక తప్పదు. ఎలా తప్పించుకుంటాడో చూస్తాంగా."

"ఇంతకీ పాపం ఆ స్టూడెంటుకి ఎలా ఉంది?"

"ఏవరికీ" శివకోటికా? వాణ్ణి తీసుకునేగదా మేం వస్తే। ఆస్పత్రి బయట కారులో ఉంచాం! ముందు డాక్టరుగారితో మాట్లాడి చావుదెబ్బలు తగిలేయని సర్టిఫికేటు పొందాలి, అది కదా ముఖ్యం"

అనుకుంటూ రివ్వున పారిపోయాడు ఆ కుర్రాడు. శేషాద్రి మనసు పరిపరివిధాల పోయింది. కుర్రాడికి మందు వెంటనే వేయించడంకన్న వాణ్ణి చచ్చేలా తన్నేరనే సర్టిఫికేటు సంపాదించడం ముఖ్యమన్నమాట। వాళ్లూ అలా వెళ్లారో లేదో 'ఏరీ డాక్టరుగారు ఏరీ?' అంటూ మరో బ్యాచ్ వచ్చి పడ్డారు. వాళ్ళూ సర్జికల్ వార్డువైపు మళ్ళారు' వాళ్ళు నాయుడమ్మ పక్షాన పనిచేసే కాలేజీ స్టూడెంట్సట. రోజుకి ఒక్కొక్కడికి ఎంత పేదవాడైనా పది రూపాయలు తక్కువ కాకుండా ముడతాయని సిస్టర్ నోటమ్మాట విన్న శేషాద్రికి ఉన్న మతి కాస్తా పోయినట్టయింది.

ఇలాంటి సంకుచిత వాతావరణంలో ఈ సోమశేఖరం చిరునవ్వుతో ఎలా రాజ్యం చేస్తున్నట్టు? ఇన్నాళ్ళూ ఇలాంటి క్లిష్ట పరిస్థితి ఎదురుపడలేదేమో। ఈ మధ్యనే వీరు కొద్దికొద్దిగా నమ్మకం పెంచుకుంటున్న మంచితనం, నిజాయితీ, నీతీ, ఇలాంటివి ఈ క్షణానే చెల్లాచెదురు అయి పోతాయేమో ఇప్పుడు ఏ పార్టీని ఎలా సంతుష్ట పరచి, రెండో పార్టీతో విరోధం తెచ్చుకుంటాడు? లేదా ట్రాన్సఫర్ కోసం ఏ

హైదరాబాదో తరిగెడతాడా! ఇంతకీ వీళ్ళిలా పరస్పరం కక్షలతో ఆవేశాలతో కాలం గడిపేస్తోంటే దెబ్బతిన్న ఆ కుర్రాడు ఏమైపోతాడో!"

తలుపు దగ్గిర ప్యూన్‌ని ఉండమని చెప్పి శేషాద్రి సర్జికల్ వార్డువైపు నడిచాడు. చూస్తూండగా జనం పెరిగి గోలా, పెద్ద గొంతుకలతో అరుపులూ వాగ్వాదాలూ ఆస్పత్రి నిశ్శబ్ద వాతావరణం అంతా గందరగోళం అయిపోయింది. మేడ మెట్లు ఎక్కి ఫస్ట్‌ఫ్లోర్ పోర్టికో చివరికివచ్చి వీధివైపు చూశాడు. శేషాద్రి. సోమశేఖరం మెట్లమీద నిలబడి ఒక ఇద్దరు కుర్రాళ్ళతో ఏదో నచ్చచెబుతున్నాడు. మరో గడికి ఎలా వచ్చిన కారు అలా వెళ్ళిపోయింది. మరో అరగంటకి ఆస్పత్రిలో మామూలు పరిస్థితులు నెలకొన్నాయి. తన కళ్ళని తనే నమ్మలేక పోయాడు శేషాద్రి. అన్ని దెబ్బలు తిన్న కుర్రాణ్ణి ఎడ్మిట్ చేసుకోకుండా ఎక్కడికి ఎలా తరలించేశాడు. సోమశేఖరం? కుర్రాళ్ళని ఎలా కన్విన్స్ చేయగలిగేడు! భుజంమీద బరువుగా చెయ్యి పడితే ఇటు తిరిగేడు.

'ఇక్కడా నువ్వున్నావ్? ఇంటికి పారిపోయావేమోనని ఫోన్ చేస్తే శైలజ అక్కడలేవని చెప్పింది. ఇదంతా నీకు తలనొప్పిగా ఉందేమో... అయామ్ సో సారీ శేషూ... మా రూంకి పోదాం పద... తందూరి చికెన్ టూ ప్లేట్లు పంపమని హోటల్ సవేరాకి ఫోన్ చేశాను. షంకేస్ బ్లడ్ అని మంచి ఫారెన్ లిక్కరు కస్టమ్స్ ఆఫీసరు పెళ్లాం అమ్ముతుంది. ఇప్పుడే మనిషిని పంపించాను. ఓసారి రుచిచూస్తే వదలవ్. ఇవాళ మా గదిలోనే నీకు డిన్నరు, ఈలోగా ఏమైనా సాఫ్ట్ డ్రింక్స

వేసుకుందామా ? ఏం, జరిగింది మరిచిపోలేక పోతున్నావా ? ఇలాంటివి మాకు మామూలే... రా...'

గదిలోకివచ్చి కుర్చీలో కూర్చుంటూ అప్రయత్నంగా తలెత్తి చూశాడు శేషాద్రి. సోమశేఖరం మొహాన మళ్ళీ అదే చిరునవ్వు. స్నేహితుని మొహాన అయోమయావస్థ చూచి అతనికి నవ్వు ఆగింది కాదు.

"ఇంతలా కొంపలు అంటుకుపోతూంటే నీకు నవ్వెలా వస్తోందిరా? ఇంతకీ 'హాడిచేస్తాం' చంపేస్తాం' అన్నంత ఉద్రేకంగా వచ్చి పడ్డారే ఇరుకక్షాలవాళ్ళూ, వాళ్ళకేం మత్తుమందు జల్లి పంపించావ్? అన్నిటినీ మించి నీ విధి నిర్వహణలో యీ నాడు నువ్వు చేసిన యీ లోపాన్ని నీ స్నేహితుని ఎదుట ఏమని సంజాయిషీ ఇవ్వదల్చుకున్నావ్?"

"విధి నిర్వహణలో లోపమా, ఏమిటది?"

"చావుదెబ్బ తిని ఆస్పత్రికి వచ్చాడు పాపం ఆ స్టూడెంటు. వెంటనే ఎడ్మిట్ చెయించి ఎటెండ్ అవవలసిన డ్యూటీ నీకు లేదా?"

నిజమే ...కర్తవ్య నిర్వహణ ప్రసక్తి తెచ్చేవు గనుక. నేనే నిన్ను ఓ ప్రశ్న వేస్తున్నాను. ఈ అరగంట అల్లకల్లోలానికే ఆరోగ్యంగా ఉన్న నువ్వు మొహం వేలాడేసి జబ్బు మనిషిలా తయారయ్యావ్. రకరకాల రోగాలతో బాధపడుతూ ఇక్కడచేరి చికిత్స పొందుతూ విశ్రాంతి తీసుకుంటూ కోలుకుంటున్న రోగులు ఇదివరకు హాస్పిటల్‌లో ఎడ్మిట్ అయిన వాళ్ళున్నారు. అసలే రోగులు. ఇలాంటి గొడవ గంటలకొద్దీ

జరిగితే వాళ్ళేమైపోతారు? వాళ్ళని పరిరక్షించడం నా మొదటి డ్యూటీ కాదంటావా?"

శేషాద్రి ఒక్క నిముషం మౌనంగా ఉండిపోయాడు. అయినా మళ్ళీ ప్రశ్నించాడు. "అది సరే, కాని ట్రీట్‌మెంట్ కోసం వచ్చిన పేషెంట్‌ని అలా పంపించెయ్యడం నాకేం నచ్చలేదు. ఆ కేసు ఫెయిల్ అయిపోతే ఆ పాపం నీది కాదా? అదిగాక పేషెంట్‌ని ఎడ్మిట్ చేసుకుని మిగిలిన వాళ్లని పంపించెయ్యొచ్చుగదా, ఎంత స్టూడెంట్సు అయితే మాత్రం అంత అన్‌రీజన్‌బుల్‌గా ఉంటారా?" "నీకు అనుభవం లేదు మరి నేనేం చెప్పితే తలకెక్కుతుంది? కాలేజీ కుర్రాళ్ళతో గొడవ కన్న కందిరీగలతో కాపురం నయం? ఈ తప్పు వాళ్ళది కాదు. వాళ్ళనలా తీర్చిదిద్దిన లెక్చరర్లదీ, పేరెంట్సుదీ, ఊళ్ళో పెద్దలదీ. వాళ్ళలో చాలా మందికి శరీరమేగాని కరస్పాండింగ్‌గా మెదడు పెరగలేదు! చదువులో పైకి రాలేక తక్కిన పలు విధాల పైకివచ్చి నలుగురి చేతా ఆకర్షింప బడాలని పాపం చాలా ప్రయత్నం చేస్తూ ఉంటారు. వీళ్ళ యీ బలహీనతల్ని పార్టీ మనుషులు ఉపయోగించుకొని ఎక్స్ప్లాయిట్ చేస్తూ వుంటారు. ఒక్క స్టూడెంట్‌ని ఎడ్మిట్ చేసుకొంటే ఏం పోయిందని అడిగేవు. అంతకన్న నిప్పుని కొంగున ముడేసు కోవడం క్షేమకరం. స్టూడెంట్‌గిరీ అన్నది వీ వీ గిరికంటె పెద్ద పదవి అని వాళ్ళ నమ్మకం. స్పెషల్ ప్రివిలేజెస్ ఎక్స్పెక్ట్ చేస్తారు ప్రత్యేకమైన ట్రీట్‌మెంట్ ఆశిస్తారు. ఎంత చిన్న ఇంజరీ అయినా స్పెషల్ రూమ్ ఇవ్వాలి. ఇంక ఆ స్టూడెంట్ ప్రవాహం ఎటువంటి సమయ సందర్భాలూ క్రమశిక్షణాలూ పాటిం

చను. దెబ్బమీద దెబ్బతగిలి కొబ్బరి బొండాంలా వాచి పోయినా సరే 'వెంటనే ప్లాస్టరు వెయ్యలేదేం ?' అని కళ్ళెర్ర చేస్తారు ! ఫలానా మందు ఎందుకివ్వలేదు ? ఇన్నాళ్ళయినా టెంపరేచరు దిగదేం ?—అని ఏ బీ సీ డీ లు తెలీకపోయినా ఏ ఎఫ్ఫార్సీయస్సో అయినట్టు నిలదీస్తారు. స్వేచ్ఛా విహారులై హాస్పిటల్ని ఓ కాలిక్షేపం చేస్తారు—ఇవన్నీ చెబితే అర్థమయే విశావు !

"ఇంత ఇలాంటివాళ్ళని మరి ఏంచెప్పి ఎక్కడికి పంపించావ్ ?"

"పేషెంటుని చూశాను. బలానికి ఓ ఇంజక్షన్ ఇచ్చేను పెద్ద దెబ్బలేం తగలలేదుగాని, అలా చెబితే వాళ్ళు సంతృప్తి పడరు. వెళ్ళరు. కముకు దెబ్బతిని షాక్అయి తెలివితప్పి ఉన్నాడు కుర్రాడు. గుండె దెబ్బతిందనీ, నీరసంగా ఉందనీ, గుండె అదటులోని అతిసున్నిత చలనాలను రికార్డ్ చేసే కార్డియోగ్రాప్లాంటి ఆధునిక పరికరాలు యీ చిన్న ఆస్పత్రిలో లేవనీ వెంటనే పట్నం తీసుకెళ్ళి పెద్దాస్పత్రిలో జాయిన్ చెయ్యమని నమ్మించి పంపేశాను—దాంతో ఇతర రోగుల్ని యీ గొడవనుంచి రక్షించడమే కాక అంతో ఇంతో నన్నుకూడా నేను రక్షించుకున్నట్లైంది !"

"అదేమిటి?"

"లేకపోతే? ఇక్కడికి పేషెంటుని తేవడంలో వాళ్ళ ముఖ్యోద్దేశం అతనికి ట్రీట్మెంట్ ఇప్పిద్దామని కాదు. బాగా దెబ్బలు తగిలి నట్లు సర్టిఫికెట్ పుచ్చుకుని కేసు పెడదామని. ఆ సర్టిఫికేటుకూడా దగ్గరుండీ వాళ్లుడిక్టేటు చేసినట్టు ఇవ్వాలి.

డాక్టరుగా నేను పరీక్ష చేసి ఇవ్వడం కాదు. అలా ఇస్తే కోటి లింగం పార్టీ కోరినంత ఫీజు ముట్ట చెబుతుందనుకో. అలా చెయ్యడం వృత్తి ధర్మమో కాదో అలా ఉంచి ఇస్తే నాయుడమ్మ పార్టీ ముట్టచెప్పేది మరో విధంగా ఉంటుంది!" పీపు తడుముకుంటూ సోమశేఖరం పక పక నవ్వేడు. ఇలాంటి సమయంలో అతనెలా నవ్వగలుగుతున్నాడో ఎంతఆలోచించినా శేషాద్రికి అర్థం కాలేదు.

"ట్రీట్ మెంటు మాట సరే, సర్టిఫికెట్ ఇవ్వకుండా ఎలా తప్పించుకున్నావ్ ఇవాళ?"

"గుండె పరిశోధనలో నేను స్పెషలైజ్ చెయ్యలేదనీ పట్నంలో పెద్దాసుపత్రిలో పెద్ద డాక్టర్ల చేత పరీక్ష చేయించి మంచి సర్టిఫికెట్ సంపాదిస్తే దానికింక తిరుగుండదనీ నచ్చ చెప్పి పంపించ గలిగేను."

"అలా నూటికి తొంభై తొమ్మిదిపాళ్ళు జరగదనే నమ్మకంతోనే అలా చేశాను. అదిగాక స్టూడెంట్స్ అడిగితే కాదనడానికి చాలామందికి దమ్ములుండవు అంతగా వస్తే అప్పటికేదో ఆలోచించుకోవచ్చు... ఇలాటి ఊళ్లో సహా నేనింత పాపులర్ అవడానికి కారణమేమిటని వచ్చిందగ్గర్నుంచి నన్ను ప్రశ్నించి చంపేస్తున్నావు. ఈ రోజుల్లో జయప్రదంగా ఏ ఉద్యోగం నిర్వహించాలన్నా కొంత మిస్చిఫ్ అవసరం. నాలో ఏదో మంచి మార్పు వచ్చిందని దానికి కారణం మా శైలజా అని కూడా అడిగేవు. నీకుకూడా నేను కొత్తగా గొప్పగా తోచేనంటే నా ప్లే ఎంతగా పేసేస్తోందో అర్థమవుతోంది! నిజం చెప్పాలంటే నాకు మారడం కష్టం

లేదు. ఎప్పట్లా ఏ బాధ్యతా బరువూ లేకుండా సరదాగా చెలాకీగా గడిపెయ్యడమే నా కిష్టం పైకి మరోలా కనపడతా నంతే. నేను నిజం చెప్పడానికి ఇష్టపడే మనుషులు ఇద్దరే ఇద్దరు. ఒకరు నువ్వూ. ఇంకొకరు మా అమ్మగారు. ఆవిడుంటే ఇప్పుడెంత సంతోషించునో - అన్నావు ఇందాక నువ్వూ. పూర్తిగా పొరపాటు. సంతోషించడానికి నాలో వచ్చిన మార్పేమీ లేదు. ఆవిడే ఉంటే నేనిలా తయారయేవాణ్నే కాదేమో ...అమ్మ పోయింతర్వాత 'ఇంకా ఏం చేస్తే ఏం' అనే ఓ మొండితనం వచ్చేసిందినాకు. అన్నట్టు ఆవిడెలా పోయిందో నీకు తెలీదు కదూ ?"

శేషాద్రి తెల్లబోయి సోమశేఖరం వైపు చూశాడు. తల్లిపేరు తలచుకోగానే ఎక్కడలేని దిగులూ ఆ మొహాన్ని ఆక్రమించుకు కూచుంది. ఎంత క్లిష్టపరిస్థితికైనా ఎదురొడ్డనే ఆ చిరునవ్వంతా ఎక్కడికి పోయిందో। సంభాషణ ఇలా అనుకోని విషాదచాయల వైపుకి మళ్ళడం శేషాద్రి కెంతో బాధనిపించింది. అయినా సోమశేఖరం తను చెప్పదల్చుకున్నది పూర్తి చెయ్యకుండా ఆపలేదు.

"నాకు జ్ఞాన మొచ్చిందగ్గర్నుంచీ చూసే వాణ్ణి, ఎందుకో అందుకు మా నాన్నగారు మా అమ్మని కొడుతూ ఉండేవారు. పది పదిహేనేళ్ళప్పుడు నాకెలా అర్థమౌతుంది. అదొక ఆటవిక ప్రవృత్తి అనీ, మానసిక మైన బలహీనత అనీ! ఉన్నట్టుండి ఆయన కేదో ఉద్రేకం పుట్టుకొచ్చి ఆపు కోలేక గొడ్డుని బాదినట్టు బాదేసేవారు. ఆ వేడి చల్లారగానే ఏడుస్తూ

కాళ్ళమీద పడిపోయే వారుట. మళ్ళీ అదేమిటో నన్ను కొట్టే వారుకారు, అమ్మనే. ఇప్పుడయితే సైకలాజికల్‌గా ఆలోచిస్తే ఆయన మీద అసహ్యంతో పాటు కించిత్తు సానుభూతి కూడా కలగక మానదు. కాని తెలిసీ తెలియని ఆ చిన్న తనంలో నాకింత విచక్షణా జ్ఞానం ఏదీ? నేనందులో ప్రవేశించక పోతే ఆ రుగ్మత తగ్గక పోయినా ఇంత దారుణంగా పరిణమించేది కాదు. నాకంటే బాగా పెద్దవాడూ, అర్జనా పరుడూ, బలవంతుడూ అయిన మా నాన్నని నేనేమీచెయ్యలేక ఆకోపమంతా మా అమ్మ మీద చూపించేవాణ్ణి. ఎదురు తిరగమని ప్రోత్సాహించే వాణ్ణి. అలా తిరగ లేదని వేధించేవాణ్ని. నాన్న కొట్టడంకన్న ఇరుగు పొరుగు వారు అదివిని అవమానించడం అమ్మని మరింత బాధించి ఉండాలి. ఆశలన్నీ నా మీదే పెట్టుకుని ఉండి ఉంటుంది. ఏరోజు కారోజు నేనూ ఆమెని సాధిస్తూంటే ఏమైపోవాలి? "నాన్న కొడుతుంటే గుడ్లప్పచెప్పి ఏదో తప్పు చేసినట్టు ఎందుకు పడాలి నువ్వు? ఈ సారి అదేమని అడగక పోతే ఈ ఇంట్లో భోంచెయ్యనంతే..." అని ఓ సారి బెదిరించి మూడ్రోజులు ఇంట్లో భోంచెయ్య లేదు. తర్వాత ఓ రోజు మా అమ్మ మళ్ళీ తన్నులు తింది. 'ఛీ ఛీ. ఈ ఇంట్లో ఉండడానికే సిగ్గేస్తోంది. తెల్లారి సరికి నా మొహం చూడవునువ్వు' అని బెదిరించాను. ఆమాట నిజమే. ఆరాత్రే అమ్మ నూతిలోపడిపోయింది. సడెన్‌గా గుండె ఆగిపోయిందని ఇరుగు పొరుగులతో చెప్పేము. కాని జరిగింది వేరు. నాకిప్పుడు అనిపిస్తుంది మా అమ్మని చంపింది నాన్న కాదని, నేనేనని.

మా అమ్మ పోయాక మా నాన్న ఇంచుమించు పిచ్చెత్తిపో యూరు. ఏడాది కంటే బతక లేదు కూడాను!"

సోమశేఖరం కళ్ళనీళ్ళు తుడుచుకుని అన్నాడు.

"ఇంట్లో ఇలాంటి ఒడుదుడుకులున్న నాలాంటి వాడికి చిన్నప్పుడే దురలవాట్లు అలవడడంలో ఆశ్చర్యం ఏముంది! కావలసిన వాళ్ళు కరువై కావలసినంత ఆస్తి మిగుల్తే మనిషి ఏమౌతాడో అదే అయ్యాను నేను. కఠినమైన ప్రపంచంలో బతకడానికి అవసరమైన కపట నాటకం మాత్రం ప్రాక్టీస్ చేస్తున్నాను, ఎవరికోసం, ఎందుకని మారాలి నేను? అసలు మారడం ఇష్టం లేదుకూడా. ఎల్లకాలం బాధ్యతా రహితంగా బతకడం తప్పని అప్పుడప్పుడు మనసు బాధించినా, అందులో కూడా జస్టిఫికేషన్ లేకపోలేదు మరి! ఇంతకీ ఈ కాలేజి కుర్రాళ్ళని ఎడ్మిట్ చెయ్యడం విషయంలో నా పెర్సనల్ అబ్జెక్షన్ కూడా ఒకటి లేక పోలేదు,. మళ్ళీ మొదటి విష యానికి వస్తున్నా ...నీ దగ్గర నాకు దాపరికం సిగ్గూ దేనికి?"

అప్పటికే ఎదురు చూడని, ఎప్పుడూ ఊహించి ఎర గని కొన్ని నిజాలు, తనకెంతో దగ్గర వాడనుకున్న సోమశేఖ రంవి' ఇముడ్చుకోలేక కలవర పడుతోంది శేషాద్రి మనసు. ఎంతో తెలిసిన వాడనుకున్న ఒకవ్యక్తి నుంచి ఒక్కరోజులో ఎన్ని కొత్త విషయాలు తెలిశాయి? ఇంకా ఉన్నాయా అతను ఎరుగనివి! మళ్ళీ మామూలు చిరునవ్వు మొహంతో కంటిన్యూ చేశాడు సోమశేఖరం. 'ఆ మధ్య ఆరునెలలు క్రితం ఇలాగే ఓ స్టూడెంట్‌ను ఎడ్మిట్ చేశాం, ఇలా పార్టీకక్షల్లో దెబ్బలుతిని అతనేం రాలేదు, క్రికెట్ ఆటలో షో చెయ్యి

ఫాక్చరు అయింది. ఆస్పత్రిలో చేర్చుకున్నాం. ఇక చూడు అతని కోసం వచ్చేపోయే జనం. అతన్తో తోడుగా పడుకుంటాం అంటూవచ్చి రాత్రిపూట ఇక్కడ నానా గోలా చేస్తూ పేకాట వేసేవారు. ఆ రోజుల్లోనే ఇంకో తమాషా జరిగింది. జనప్రియ అని ఓ కేరళ అమ్మాయి నర్సుగా చేరింది. ఓ రాత్రి వేళ కరెంటు పోయినవేళ ఆ నర్సు కుర్రది ఓ కట్ బనీన్ కుర్రాడి భుజంమీద చెయ్యేసి తనవైపు లాగుకుందిట. అది మరొకడు కనిపెట్టి నలుగురికి ఊదేస్తే అక్కడ చేరిన కాలేజీ కుర్రాళ్ళందరూ ఆ నర్సుని ఆ చీకట్లో నానా అల్లరీ చెయ్య బోయారుట. అప్పుడా అమ్మాయి తనేమి ఎరగనని నలుగుర్ని నమ్మించడం కోసం పెద్ద పెద్ద కేకలు పెట్టిందిట. ఈ కబుర్లన్నీ కంపౌండరు బాబూరావు ద్వారా తెల్లారేసరికి నా చెవిన పడ్డాయి. అప్పుడే నాకు జ్ఞానోదయమైంది. వెంటనే ఏం చేశానో తెలుసా ?"

"వెంటనే ఆ స్టూడెంట్‌ని డిస్చార్జి చేయించేశావు కాబోలు !

"అది సరే... ...అంతకంటే ముందు చేసిన ముఖ్య మైన పని ఒకటుంది. అప్పటిదాకా చేతులున్న గుడ్డ బనీన్లు వాడేవాణ్ణి నేను. అవన్నీ స్టీలుగిన్నెల వాడికోసం మా కైల జకి దాన పట్టారాసి, డజన్ కట్ బనీన్లు అప్పటి కప్పుడు తెప్పించుకున్నాను. ఆ కుర్రాళ్ళకంటె మహా ఉంటే ఓ పదేళ్లు నేను పెద్ద ఉండొచ్చు. అంతమాత్రాన నా వయసేం మళ్ళి పోలేదే ! మెడిసిన్ చదువుతున్నప్పుడు ఎంత సరదాగా ఎన్ని

రకాలుగా ఎంజాయ్ చేసే వాడిని! ఎంతో విలువైన కాలం వృథా చేసినట్టు నా గుండె గిల గిల కొట్టుకుంది. ఆ తర్వాత క్రమ క్రమంగా జనప్రియ మరొకరి జబ్బమీద చెయ్యి వేసినట్టు సాక్ష్యం లేదు!"

కళ్ళు మిలమిల మెరుస్తూండగా కదనం పూర్తిచేశాడు సోమశేఖరం,

"ఏం మనిషివిరా నువ్వు? చేసింది చాలక, సిగ్గులేక చెప్పుకోడం కూడానా ?"

"అదేం లేదు సరిగదా ఇవాళ నాకెంతో హాయిగా ఉంది, పాడు ప్రపంచంలో బతికి బట్టగట్ట డానికి మనిషి పలు రకాల వేషాలు వేసినా తనకు తాను మిగల గలగాలి. మంచీ చెడ్డా ఏ మాత్రం దాచకుండా తనని తాను దర్శించుకోగలిగి నప్పుడే వ్యక్తిత్వం అనేది మిగులు తుంది. అప్పుడూ ఇప్పుడూ ఏ మాత్రం మారకుండా నేను నేనుగా మిగలడం కన్న నాకు ఆనందమేముంది! ఏ మాత్రం శంకా భయమూ లేకుండా చెప్పగలిగే నీలాంటి ప్రాణమిత్రుడు దొరకడం కన్న నాకు కావలసిందేముంది!"

"అది కాదురా, నిన్నే ప్రాణపదంగా చూసుకుంటున్న నీ భార్య పట్ల ఇది ద్రోహం కాదా? రేప్పొద్దున నీకు పిల్లలు పుడితే వాళ్ళకేం చెప్పగలవ్ నువ్వు?"

"నా భార్య పట్ల నేను కొత్తగా తలపెట్టిన ద్రోహ మంటూ ఏంలేదు. ఇక పిల్లలంటావా, ఒకర్ని చూసి అనుస

రించి కాక ఎవరికి వారు నిర్ణయించుకుని వ్యక్తులుగా నిలబడి తేనే వరల్డ్‌లో వెరైటి అనేది మిగిలేది ... సరే ... ఇంకా ముడి సరుకు దిగి చావడేం. నీ కెలా ఉందో ఆకలి చంపే స్తోంది నన్ను!" హోటల్ సవేరాకి డయల్ చేస్తున్న సోమశే ఖరం వైపు ఆశ్చర్యంగా ఆప్యాయంగా చూశాడు శేషాద్రి.

—( * )—